## మంచిమాట

తమ సమస్యలను నీతో పంచుకునే వారిని చిన్నచూపు చూడకు... నీకు చెప్పడం వారు అసమర్థులై కాదు, నీమీద నమ్మకంతో.



# DD9 వార్త

తెలుగు దినపత్రిక

www.dd9vaartha.com

సంపుటి : 01 సంచిక : 144 శనివారం, 10, 2026 , పేజీలు - 06 వెల : 3/-


## చైనా మాంజ
# కేసులు పెడతాం



**హైదరాబాద్:** చైనా మాంజా వినియోగంపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక నిర్ణయం ప్రకటించారు. మకర సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో ప్రమాదాలు పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని, చైనా మాంజా కొనుగోలు చేసినా, అమ్మినా, లేదా వాడినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నిషేధిత మాంజాతో గాలి పటాలు ఎగరేయడం వల్ల ప్రమాదాలు సంభవించినా, గాయాలు కలిగి నా బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.ప్రజల ప్రాణాలతో పాటు పక్షలకు, విద్యుత్ లైన్లకు, వాహనదారులకు తీవ్రమైన హానికలిగించే చైనా మాంజాను పూర్తిగా అరికట్టేందుకు అదనపు పర్యవేక్షణకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## వివాదాలు కాదు..
# పరిష్కారాలు ముఖ్యం

- ఉమ్మడి రాష్ట్రంలోప్రాజెక్టులకు అడ్డంపడకండి
- జలవివాదాలతో రాజకీయ ప్రయోజనం కోరుకోం
- మన సమస్యలను మనమే కలిసి పరిష్కరించుకుందాం
- ఏపి సిఎం చంద్రబాబుకు తెలంగాణ సిఎం రేవంత్ సూచన
- కృష్ణా జలాలపై ఏపీతో చర్చలకే ప్రాధాన్యం
- రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవం





**హైదరాబాద్,జనవరి 9 :** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించు కోవాలని చెప్పారు. కోర్టుల్లో కాకుండా.. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. లో సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని మిగతా2లో...




## జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు
# బడ్జెట్ సమావేశాలు

● తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ● 29న ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టనున్న కేంద్రం ● యధావిధిగా ఫిబ్రవరి1ననే బడ్జెట్ ప్రసంగం

## రచ్చకెక్కిన బెంగాల్
# రాజకీయం

● ఇడి చర్యలపై మమతా నిరసన ప్రదర్శన ● మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డ బిజెపి ● విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఇడి పిటిషన్



**కోల్‌కతా,జనవరి 9 :** ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ , దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. అవినీతిలో కూరుకుపోయా రంటూ తనపై మిగతా2లో...

## పిఠాపురంలో గొడవలు చేస్తామంటే
# ఏరిపారేస్తా...

అవాస్తవాలు వైరల్ చేస్తూ చూస్తూ ఊరుకోను

శాంతిభద్రతల విషయంలో పోలీసులు కఠినంగా ఉండాలి

పట్టణ పారిశుద్ధ్యంపై మున్సిపల్ సిబ్బంది శ్రద్ధ పెట్టాలి

పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు ప్రారంభించిన పవన్ కళ్యాణ్

సంక్రాంతి అందరి పండగగా జరుపుకోవాలని పిలుపు



**కాకినాడ,జనవరి 9 :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా సుమారు రూ.3 వందల కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్య క్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా పీఠికాపుర సంక్రాంతి మహోత్సవంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పిఠాపురం నియోజకవర్గలో కొందరు గొడవలు సృష్టించేందుకు వస్తే ఇక్కడే తాను తిష్టవేసి ఏరి పారేస్తానని హెచ్చరించారు. మిగతా2లో...



## ప్రశాంతంగా ముగిసిన
# ఉత్తర ద్వార దర్శనం

దర్శనాలపై దాదాపు 93 శాతం భక్తులు సంతృప్తి

స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 7.83 లక్షలు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లు రాక

మీడియా సమావేశంలో టిటిడి ఛైర్మన్, ఇవోలు వెల్లడి

**తిరుమల,జనవరి 9 :** వైకుంఠ ద్వార దర్శనాలను అద్భుతంగా జరిపామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. టీటీడీ ఏర్పాటుచేసిన సౌకర్యాలపై భక్తులు హర్షం వ్యక్తం చేశారని ఛైర్మన్ తెలిపారు.వైకుంఠ ద్వార దర్శనాల విజయవంతంపై తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, ఏఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఏర్పాటు చేసిన మిగతా2లో...

## సంస్కృతి,సంప్రదాయాలను
# కాపాడుకోవాలి

● పండగల విశిష్టతను బాగా చాటాలి ● సంక్రాంతి అంటే నాకు ఎంతో ఇష్టం ● ఇందిర పుణ్యమా అని రాజకీయాల్లోకి వచ్చా ● విశాఖ సంక్రాంతి సంబరాల్లో వెంకయ్యనాయుడు




# సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

సైబర్ మిత్ర పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు

బాధితులు 1930కు ఫోన్ చేయాలన్న కమిషనర్ సజ్జన్నార్



**హైదరాబాద్,జనవరి 9 :** సైబర్ నేరాల బాధితులకు హైదరాబాద్ పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. శు క్రవారం నాడు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలో సైబర్ మిత్ర పేరుతో రూపొందించిన ప్రత్యేక విభాగాన్ని సజ్జనార్ ప్రారంభించారు. అనంతరం సీపీ సజ్జనార్ మాట్లాడుతూ..

## ఉర్దూ వర్సిటీ భూముల
# జోలికి రావద్దు

- కాంగ్రెస్ ప్రభుత్వానికి కెటిఆర్ హెచ్చరిక



**హైదరాబాద్,జనవరి 9 :** మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూములపై రేవంత్ సర్కార్ కుట్రల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దేశంలో మైనార్టీల సంరక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ.. ఉర్దూ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయడమే కాపాడటమా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్‌తో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు సమావేశమయ్యారు. యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై చర్చించారు. అనంతరం మిగతా2లో...

## ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు
# ఎదురు దెబ్బలు

పోలీస్ అధికారులకు లొంగిపోయిన మరో 63మంది



**రాయ్‌పూర్,జనవరి 9 :** ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులు తున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లాలో పోలీస్ ఉన్నతాధికారులు ఎదుట 63 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 18 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మోహన్ కడ్తీ.. తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా తమ వద్ద ఉన్న ఆయుధాలను పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. లొంగిపోయిన మొత్తం మావోయి స్టులపై రూ. కోటి రివార్డు ఉందని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన లోన్ వర్రాటు మిగతా2లో...

# సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుకోవాలి

**విశాఖపట్నం, 9:** భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలని.. భారతీయ వంటలు అందరూ తినాలని దేశ ప్రజలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మన పండగల విశిష్టతను చాటాలన్నారు. సంక్రాంతి పండగ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. విశాఖపట్నంపై తనకు ఎంతో ప్రేమ ఉందని చెప్పారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. తాను ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థినని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. తెలుగు రైతుల పండగ సంక్రాంతి.. తెలుగు వారి లోగిళ్లలో ఇది పెద్ద పండగని వెంకయ్యనాయుడు అభివర్ణించారు. ఫల సాయాన్ని అందించే వ్యవసాయాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదని ప్రజలకు ఆయన హితవు పలికారు. అలాగే జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను, మాతృభాషను మర్చిపోకూడదని చెప్పారు. ప్రజలకు అర్థమయ్యే భాషలో పరిపాలన చేయాలంటూ ప్రభుత్వాలకు ఆయన సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలంటూ తల్లిదండ్రులకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కీలక సూచన చేశారు.విద్యార్థి దశలో ఎన్నో పోరాటాలు చేశానని.. జైలుకు సైతం వెళ్లానని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఆమె కారణంగానే తాను రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. స్వతంత్ర భారతదేశంలో ఆత్మ నిర్భర భారత్ కోసం అందరూ కృషి చేయాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ప్రపంచంలో నాలుగో వంతు జీడీపీ భారతదేశానిదేనని పేర్కొన్నారు. పశు సంపద ఎంత బాగుంటే జాతీయ సంపద కూడా అంత బాగుంటుందన్నారు. ఆత్మ నిర్భర భారత్ ముందు.. ఎవరు ఎన్ని సుంకాలు వేసినా ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. అందుకే ఆత్మ నిర్భర భారత్ అని ప్రధాని నరేంద్ర మోదీ అంటున్నారని వివరించారు. తాను రైతు బిడ్డగా పుట్టానని.. అందుకే రైతులు అంటే తనకు చాలా అభిమానమన్నారు.

# వివాదాలు కాదు..పరిష్కారాలు ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

చెబుతా. వివాదాలు కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతా. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందాం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా ఓ విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదన్నారు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మేం వివాదాలు కోరుకోవడం లేదు. పరిష్కారం కోరుకుంటున్నాం అని అన్నారు. రాజకీయ ప్రయోజనాలు కాదు.. ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నాం. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాలి. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు.. ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదు. ఈ విషయంలో ఏపీ సర్కారు ఒక్క అడుగు ముందుకు వేస్తే.. తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుందని సీఎం హామీ ఇచ్చారు. ఈ మేరకు కృష్ణా నది జల వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొందాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం అందరూ సహకరించాలని పార్టీలను విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేస్తూ.. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టవద్దని కోరారు. అడ్డంకుల వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం లేదని, రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదం కోరుకోవడం లేదని.. పరిష్కారమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కాదని.. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టీకరించారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమన్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, మల్ రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉర్దూ వర్సిటీ భూముల జోలికి రావద్దు

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న మైనార్టీ విద్యార్థుల యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమే మీ సంరక్షణనా అని ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. మీరు చెబుతున్న మొహబ్బత్ కి దుకాణం ఇదేనా అని ప్రశ్నించారు. విద్యార్థులను వారి భూములను తీసుకొని రోడ్డుమీద వేయడమేనా? అని నిలదీశారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న సమస్యలపై రాహుల్ గాంధీ మాట్లాడాలి కానీ వారి భూములు గుంజుకుంటున్న తమ ప్రభుత్వంపై స్పందించకపోవడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. యూనివర్సిటీలో ఉన్న భూములు ఖాళీగా ఉన్నవి కావు భవిష్యత్తు విస్తరణ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రతిష్టను తగ్గించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. గతంలో ఇదే యూనివర్సిటీ ప్రజా అవసరాల కోసం హైదరాబాద్ నగరం కోసం 32 ఎకరాలు ఔటర్ రింగ్ రోడ్డు కోసం ఇచ్చారని, ఖాజాగూడ నుంచి నానక్ రామ్ గూడ కు లింక్ రోడ్డు కోసం ఏడెకరాల స్థలాన్ని యునివర్సిటీ భూమి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఏనాడు కూడా హైదరాబాద్ నగర ప్రయోజనాల కోసం ప్రజాప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు భూసేకరణను ఏనాడు వ్యతిరేకించలేదని చెప్పారు. గతంలో తెలంగాణలో జరిగిన ఉద్యమం వల్లనే హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ ఏర్పడిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాలు త్యాగాల ఆధారంగా ఏర్పడిన యూనివర్సిటీని రియల్ ఎస్టేట్ కోసం వాడటం దారుణమని మండిపడ్డారు. గతంలో మేము నిజాం కాలేజీలో హాస్టల్ లేదు అంటే ప్రభుత్వ నిధులతో హాస్టల్ కట్టించామని గుర్తుచేశారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీకి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కావలసిన విస్తరణ సౌకర్యాలకు నిధులు కూడా కేటాయించి అండగా నిలబడతామని భరోసానిచ్చారు.

# ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు ఎదురు దెబ్బలు

(మొదటి పేజీ తరువాయి)

(ఇంటికి తిరిగి రండి) ప్రచారంలో భాగంగా వీరంతా లొంగిపోయి నట్లు పోలీసులు తెలిపారు. మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను శాశ్వతంగా నిర్మూలి స్తామని కేంద్ర ప్రకటించింది. అందుకోసం ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో దాదాపుగా మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. చివరకు ఛత్తీస్‌గఢ్‌లో వారి ప్రభావం కొంత మేర ఉంది. ఆ రాష్ట్రంలో పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా మావోయిస్టుల ఏరివేతకు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. దాంతో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుని.. వందలాది మంది మావోయిస్టులు మరణించారు. అలాగే వేలాది మంది మావోయిస్టులు ఇప్పటికే ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఇలా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం గతంలో ప్రకటించిన రివార్డులను అందజేస్తోంది. అదీకాక.. మావోయిస్టులు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవడం ద్వారా దేశాభివృద్ధిలో భాగం కావాలంటూ ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వం చేపట్టిన కూంబింగ్‌లో పలువురు అగ్రనేతలు ఎన్‌కౌంటర్‌కాగా.. కీలక నేతలు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు.

# కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**ఖమ్మం,జనవరి 9 :** పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను దీవించినట్లే.. పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. పంచాయితీలు, పురపాలికలు బలపడాలంటే అధికార పార్టీ అభ్యర్థులు ఉండాలన్నారు. ఇల్లందు పట్టణంలో నూతన రహదారులు, కాలువల నిర్మాణాలకు శుక్రవారం మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గంలోని నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటే గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో పర్యటించి, జీవో 76కు సంబంధించిన క్రమబద్ధీకరణ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# నటుడు నవదీప్‌కు హైకోర్టులో ఊరట

## - డ్రగ్స్ కేసును కొట్టేసిన తెలంగాణా న్యాయస్థానం

**హైదరాబాద్,జనవరి 9 :** టాలీవుడ్ యంగ్ హీరో నవదీప్‌నకు హైకోర్టులో భారీ ఉపశమనం కలిగింది. అతడిపై నమోదైన డ్రగ్స్ కేసును తెలంగాణా న్యాయస్థానం కొట్టివేసింది. నవదీప్ వద్ద డ్రగ్స్ ఉన్నట్టు ఎలాంటి ఆధారాలు లభించలేదనే ఆయన తరపు న్యాయవాది వెంకట సిద్దార్థ్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ కేసును కొట్టివేస్తున్నట్టు పేర్కొంది. దీంతో ఈ యంగ్ హీరోకు పూర్తిస్థాయిలో ఉపశమనం లభించినట్లైంది. కొద్ది నెలల క్రితం.. హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ కేసులో హీరో నవదీప్ పేరు వినిపించడంతో ఆయన డ్రగ్స్ తీసుకున్నట్టు గతంలో వార్తలు వచ్చాయి. అందులో భాగంగా.. గుడిమల్కాపూర్‌లో నమోదైన కేసులో ఎఫ్ఐఆర్‌లో అతడి పేరు నమోదైంది. ఈ ఆరోపణలపై నవదీప్ ఘాటుగా స్పందించారు. తనకు, డ్రగ్స్‌కు ఎలాంటి సంబంధం లేదని అతను వాపోయాడు. ఈ నేపథ్యంలోనే తనను అరెస్ట్ చేయొద్దంటూ అతను గతంలో తెలంగాణా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ పిటిషన్ను విచారించిన న్యాయస్థానం.. అరెస్ట్ చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది. తాజాగా ఈ కేసుపై మరోసారి విచారణ చేపట్టింది న్యాయస్థానం. నవదీప్ పేరును కేవలం ఎఫ్ఐఆర్‌లోనే చేర్చారని.. అతను డ్రగ్స్ తీసుకున్నట్టు ఆధారాలేవీ లేవని స్పష్టం కావడంతో ఈ కేసును కొట్టివేసింది.



# జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు బడ్జెట్ సమావేశాలు

**న్యూఢిల్లీ,జనవరి 9 :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. తొలి దశ సమావేశాలు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడిం చారు. మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో దశ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఉభయ సభలు సమావేశం అయ్యేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిన తేదీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తొలి రోజైన జనవరి 28న రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టను న్నారు. ఏటా మాదిరిగానే ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్జడెట్‌ను సమర్పించ నున్నారు. ఆ రోజు ఆదివారం కావడంతో సమావేశ తేదీలపై గత కొన్ని రోజులుగా సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వ తాజా ప్రకటనతో ఆ చిక్కుముడి వీడింది. దీంతో ఆదివారమై ఆ బడ్జెట్ యధాతథంగా ప్రవేశ పెడతారు.

# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఈడీ సైతం కోల్‌కతా హైకోర్టు విచారణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ప్యాక్‌పై ఈడీ దాడులకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై కోల్‌కతా హైకోర్టు జస్టిస్ సువ్ర ఘోష్ విచారణ చేపట్టినప్పటికీ భారీగా జనం హాజరుకావడంతో ఆయన కోర్టు రూమ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గత వారంరోజులుగా కోర్టుకు సెలవులు ఉండగా.. ఈ అంశంపై వచ్చే బుధవారం నాడు తిరిగి విచారణ చేపట్టనున్నారు. కోల్‌కతా హైకోర్టులో కేసు విచారణ వాయిదా పడటంతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ఈడీ శుక్రవారం నాడు ఆశ్రయించింది. తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. కాగా, హైకోర్టులో శుక్రవారం విచారణ సందర్భంగా ఈడీ తమ వాదన వినిపిస్తూ, ఐప్యాక్ కార్యాలయం, జైన్ నివాసంలో తాము సోదాలు నిర్వహిస్తుండగా అధికారులతో అడ్డగించడం ద్వారా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనిపై జైన్, తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేయాలని ఈడీ ప్రయత్నించిందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఒకవైపు కోర్టు విచారణ జరుగుతుండగా మరోవైపు ఈడీ దాడులకు నిరసనగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ జాదవ్‌పూర్ నుంచి హజ్రా క్రాసింగ్ వరకూ 5 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలు, పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు. ఏం చేసైనా సరే పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని మమతా బెనర్జీ, తృణమూల్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. టీఎంసీ చీఫ్ అవినీతి ఊబిలో కూరుకుపోయారని, ఈడీ అధికారులను బెదిరిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. మమతా చర్యల వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని.. తనను, తమ పార్టీని చిక్కుల్లోకి నెట్టే కీలకమైన సమాచారాన్ని తొలగించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

# పిఠాపురంలో గొడవలు చేస్తామంటే ఏరిపారేస్తా...

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో కాకి ఈక పడ్డ ఏదో జరిగిందని వైరల్ చేస్తూ అవాస్తవాలను ప్రసారం చేస్తున్నారని మండిపడ్డారు. పులివెందులలో సొంత బాబాయ్ వైఎస్ వివేకను ని చంపినా అది వార్తకాదని, పిఠాపురంలో స్కూల్ పిల్లలు కొట్టుకోవడం సహజమని, దానిని కూడా పెద్ద వార్త చేస్తున్నారని అన్నారు.సంక్రాంతి పండుగ అంటే కేవలం కోళ్ల పందెలు, జూదాలకు మాత్రమే కాకుండా ప్రేమను పంచాలని సూచించారు. తెలంగాణలో ఉన్న సోదరీమణులను సంక్రాంతికి ఆహ్వానించి ఆంధ్రా ప్రాంతా ప్రజల ప్రేమను పంచాలని అన్నారు. ఐక్యమత్యంగా ఉంటే అభివృద్ధి సాధించవచ్చన్న ఉద్దేశంతో టీడీపీతో కూటమిగా ఏర్పడడం వల్ల రాష్ట్రానికి ఎంతగానో మేలు జరుగుతుందని అన్నారు. అందరిని కలపడం కష్టమని అటువంటిది తాను గల్లి నుంచి ఢిల్లీ వరకు అందరినీ ఏకం చేసి విజయం సాధించానని అన్నారు.అభివృద్ధి లక్ష్యం నెరవేరే వరకు కూటమితో కలిసి ఉంటామని, అందులో సందేహం అవసరం లేదని వెల్లడించారు. వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లయితే తాను ఎందుకు రాజకీయాల్లోకి వస్తానని పేర్కొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఉత్తర ద్వార దర్శనం

(మొదటి పేజీ తరువాయి)

మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. పదిరోజుల్లో 7.83 లక్షల మంది భక్తులు వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారని, హుండీకి రూ.41.14 కోట్ల ఆదాయం వచ్చిందని వివరించారు.శుక్రవారం రికార్డు స్థాయిలో 83 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందజేశామని , భక్తుల రద్దీని ఏఐ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరిపామని పేర్కొన్నారు. సామాన్య భక్తులు సౌకర్యవంతంగా స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లతో పాటు అవసరమైన వసతి గదుల కేటాయింపు చేశామని అన్నారు.ఉద్యానవనం విభాగం ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో రంగనాయక ఆలయ సెట్ భక్తులకు విశేషంగా ఆకట్టుకుందని తెలిపారు. ఇందుకు అవసరమైన 50 టన్నుల సాంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల ఫలాలు, 4 టన్నుల కట్ ఫ్లవర్స్‌తో డెకోరేషన్ చేశామన్నారు. కల్యాణ కట్టలో 2.06 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారని ఛైర్మన్ వివరించారు.

# సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

(మొదటి పేజీ తరువాయి)

సైబర్ నేరగాళ్లకు చిక్కిన బాధితులకు ఈ సెల్ ఎంతో సహాయంగా ఉంటుందన్నారు. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో సైబర్ క్రైమ్‌పై హెల్ప్ డెస్క్ ఏర్పాటైందని వివరించారు. సైబర్ క్రైమ్‌ల్లో బాధితుల సంఖ్య పెరుగుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే 1930కి ఫోన్ చేయాలని బాధితులకు సూచించారు. సైబర్ దాడికి గురైతే మ్యూల్ ఖాతాలకు నగదు బదిలీ అయి.. విత్ డ్రా చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే గో÷-డలెన్ అవర్‌ను వినియోగించుకోవాలంటూ బాధితులకు ఆయన కీలక సూచన చేశారు. నేరం జరిగిన గంట లోపు ఫిర్యాదు చేస్తే నగదు ఫ్రీజ్ అవుతుందన్నారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేసి.. ఫిర్యాదు చేస్తే సరిపోదన్నారు. అనంతరం స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేయాల్సి ఉందని చెప్పారు. కానీ చాలా మందికి ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియడం లేదన్నారు. నూతన విధానం ద్వారా బాధితులు తమ ఫిర్యాదును పోస్ట్ ద్వారా లేదా పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్ ద్వారా పంపవచ్చన్నారు. సైబర్ మిత్ర సెల్‌లోని పోలీసులు.. బాధితులకు ఫోన్ చేసి ఫిర్యాదు ఎలా రాయాలి? ఏయే సెక్షన్లు వర్తిస్తాయనే విషయాలపై అవగాహన కల్పిస్తారు. ఇంటి నుంచే ఎఫ్ఐఆర్ పొందే సౌకర్యాన్ని కల్పించడం ద్వారా 100 శాతం కేసుల నమోదును లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ట్రయిల్‌లో భాగంగా 86 మందికి ఫోన్ చేశామని.. వారి నుంచి మంచి స్పందన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ సైబర్ నేరానికి గురికాకుండా

# 12న బషీరాబాద్ ఐటీఐలో అప్రెంటిస్ మేళా



**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 12న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కోటి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి, శిక్షణ కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో వరుణ్ మోటార్స్ హైదరాబాద్, సుఖిత్ స్టార్చ్ మిల్స్ నిజామాబాద్, ప్రీమియర్ ఎనర్జీస్ హైదరాబాద్, ఎవరెస్ట్ స్కేల్స్ సారంగాపూర్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొని ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. ఎక్సిలర్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో ఎంపికైన వారికి పూణేలోని టాటా మోటార్స్‌లో శిక్షణతో పాటు ప్లేస్‌మెంట్ కల్పిస్తారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలతో పాటు స్టైఫండ్ అందిస్తారని, అనంతరం డిప్లొమా సర్టిఫికేట్ కూడా అందజేస్తారని ప్రిన్సిపాల్ వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో 12వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం **9491566890, 8106794500** నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# కోనసమందర్ విద్యార్థిని ఘనంగా సన్మానించిన ఉపాధ్యాయులు



**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు కమ్మర్ పల్లి మండలం కోనసమందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి. నిఖిత ఎంపికైంది. ఇటీవల తిరుమన్పల్లి పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో నిఖిత అద్భుత ప్రతిభ కనబరిచి ఈ అవకాశం దక్కించుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో నిఖితను ప్రధానోపాధ్యాయులు బి. మధుపాల్, పీడీ రమేష్ గౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో నిఖిత పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటి జిల్లాకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు మెల్ల గంగాధర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక సాగుతోనే రైతులకు లాభం




**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు విధానాలను అనుసరించడం ద్వారానే రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా బెజ్జోర గ్రామంలో రైతులకు వరి సాగులో నూతన మెళకువలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ ఆఫీసర్లు మరియు ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. తడి-పొడి విధానం, నేరుగా విత్తే పద్ధతి మరియు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం వంటి పద్ధతులపై రైతులకు వివరించారు. ఈ పద్ధతుల వల్ల కూలీల ఖర్చు సుమారు ఎనిమిది వేల రూపాయల వరకు తగ్గుతుందని, సాగు సమయం కూడా ఆదా అవుతుందని పేర్కొన్నారు. నీటి వినియోగాన్ని నియంత్రించుకోవడంతో పాటు చీడపీడల నివారణ సులభమవుతుందని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చునని తెలిపారు. సదస్సులో భాగంగా రైతులకు క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్ డెమో నిర్వహించి నూతన సాగు విధానాలను ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మౌనిక, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ట్రైనర్ ప్రేమలత, ఏరియా మేనేజర్ సనూత్న, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ నక్క హరీష్, దినేష్ మరియు గ్రామ పెద్దలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లా అర్చక ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అర్చక ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కంఠేశ్వర్ ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో అర్చక ఉద్యోగుల సమస్యలపై చర్చించి, అనంతరం నూతన బాధ్యులను ఎంపిక చేశారు. అధ్యక్షుడు ఆంజనేయులు (గోల్ హనుమాన్ జూనియర్ అసిస్టెంట్), ప్రధాన కార్యదర్శి నరసింహచారి, కోశాధికారి కిషోర్, గౌరవ అధ్యక్షుడు గణేష్ శర్మ, ముఖ్య సలహాదారు సుభాష్ శాఖయ్, నిజామాబాద్ జిల్లా కన్వీనర్ రఘు కూల్కర్ ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆంజనేయులు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన ఉమ్మడి జిల్లా అర్చక ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అర్చక ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు, వారి సంక్షేమం కోసం కార్యవర్గంతో కలిసి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని తోటి అర్చక ఉద్యోగులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆహా ఏమి రుచులు

- తెలంగాణ వంటకాలు తయారు చేసిన విద్యార్థినులు
- స్టాళ్లు ఏర్పాటు చేసి ప్రదర్శన, విక్రయాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు













**ఆదిలాబాద్ జిల్లా జనవరి 09,(డిడి9 వార్త న్యూస్ )** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం లోని స్థానిక ప్రగతి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు వంట కాలు ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రతియేటా విభిన్న కార్యక్ర మాల తో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో భాగంగా ఈ సంవత్సరం ఫుడ్ ఫెస్టివల్‌ను చిన్నారులు నోరూరించే రుచులతో వంటలు చేశారు. తల్లిదండ్రుల సహకారంతో చేసిన ఈ వంటకాలను దాదాపు వంద రకాల పిండివంటలు స్కూల్‌లో ప్రదర్శించగా. టీచర్లు వారిని అభినందించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సూత్రాలను తెలియజేసేందుకు ఈ ఫెస్ట్ దోహదపడిరదని స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఇచ్చోడా మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జెలై జకు ఉపసర్పంచ్ లోక శిరీష్ రెడ్డి,మాజీ ఎంపిపి నిమ్మల ప్రితం రెడ్డి మాజీ ఎంపిటిసి నిమ్మల శివారెడ్డి హాజరయ్యారు వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాల పట్ల పిల్లలకు అవగాహనా ఈ కార్యక్రమం తోడ్పదుతుందని అన్నారు. చదువు, విలువలతో పాటు ప్రతియేటా ఏదొక శాస్త్రీయ దృక్పథంతో కూడిన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విద్యార్థులను చైతన్యం చేసేందుకు కృషి చేస్తున్నారాని వాటికీ టీచర్లు, సిబ్బంది సహకారం కూడా ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి శ్రీ సురకంటి వనమాల- వెంకట్ రెడ్డి,పాఠశాల ప్రిన్సిపాల్ కాసారం ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ ఏనుగు మంజుల, నిజాముద్దీన్, రాధ, కావేరి, ఆసన, సునీత, నందిని, కావేరి, లాస్య, రమ్య,గంగోత్రి, అక్షయా, సృజన, లక్ష్మ,సంజన,సవిత,రచన, స్వాతి,రాజు, పాఠశాల పి ఈ టి అల్లం సాయికిరణ్ రెడ్డి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు : సీపీ సాయి చైతన్య






**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** రాష్ట్రంలోని యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి 'చీఫ్ మినిస్టర్ కప్-2026' ఒక గొప్ప అవకాశమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో ఎడిషన్ సీఎం కప్ టార్చ్ ర్యాలీ ముగింపు వేడుకలు శుక్రవారం నగరంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ, క్రీడా జ్యోతిని వెలిగించి ముగింపు పలికారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సీఎం కప్ కేవలం క్రీడా పోటీలే కాదని, ఇది క్రమశిక్షణ, ఐక్యత మరియు శారీరక దృఢత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. యువత డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. సే నో టు డ్రగ్స్.. సే ఎస్ టు స్పోర్ట్స్ అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి అని ఆయన పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే కాకుండా, సామాజిక బాధ్యతగా క్రీడలను ప్రోత్సహిస్తూ ప్రజలకు చేరువవుతోందని వివరించారు. జిల్లా నుంచి ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి పవన్ కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొబ్బిలి నరసయ్య, కోచ్‌లు ప్రశాంత్, ఫారుక్, సురేష్, గంగాదాస్ మరియు వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏటీఎం దొంగల ముఠా గుట్టురట్టు : సీపీ సాయి చైతన్య




**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** నిజామాబాద్ నగరంలో ఏటీఎం దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను నిజామాబాద్ పోలీసులు పట్టుకున్నట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు. శుక్రవారం పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను తెలియజేశారు. డిసెంబర్ 31న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎంలో జరిగిన దోపిడీ యత్నాన్ని మేము సీరియస్‌గా తీసుకున్నాము. ఇన్‌స్పెక్టర్ రఘుపతి నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించాము. నిందితులు చాలా ప్రొఫెషనల్‌గా ఏటీఎం లోపల సీసీ కెమెరాలకు నల్లటి స్ప్రే కొట్టి, గ్యాస్ కట్టర్లతో మిషన్లను కోయడానికి ప్రయత్నించారు. అయితే బ్లూ కోల్ట్స్ సిబ్బంది గస్తీలో ఉండటంతో వారు భయపడి పారిపోయారని సీపీ వివరించారు. ముఠా నాయకుడు హర్యానాకు చెందిన అబ్దుల్లా ఖాన్‌కు గతంలోనే భారీ నేర చరిత్ర ఉంది. మధ్యప్రదేశ్ జైలులో ఉన్న సమయంలో హైదరాబాద్‌కు చెందిన అమీర్ అన్సారీతో పరిచయం పెంచుకుని, బయటకు వచ్చాక ఒక గ్యాంగ్‌ను తయారు చేశాడు. వీరు కేవలం తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఏటీఎంలను కొల్లగొట్టారు. గతంలో సైబరాబాద్ పరిధిలోని జీడిమెట్లలో రూ. 48 లక్షల నగదును ఇదే తరహాలో గ్యాస్ కట్టర్లతో దొంగిలించినట్లు మా విచారణలో అంగీకరించారని సీపీ తెలిపారు. నిన్న ఉదయం నిఖిల్ సాయి ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా, బలెనో కారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురిని మా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారి కారులో రాళ్లు, కర్రలు, మాస్టర్ కీలు మరియు గ్యాస్ కట్టర్ సామాగ్రి ఉండటంతో లోతుగా విచారించగా అసలు విషయం బయటపడింది. వీరు హైవేలపై తిరుగుతూ ముందుగా వాహనాలను దొంగిలించి, వాటి ద్వారా ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుంటారు. నిందితుల నుంచి ఒక బొలెరో, ఒక బలెనో కారుతో పాటు ఆక్సిజన్ సిలిండర్లు, గ్యాస్ కట్టర్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ముఠాను పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ రఘుపతి, ఒకటో పట్టణ పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ ప్రత్యేకంగా అభినందించి, రివార్డులను ప్రకటించారు.

# చంద్రశేఖర్ కాలనీలో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలి



**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** నిజామాబాద్ నగరంలోని 42వ వార్డు చంద్రశేఖర్ కాలనీలో ప్రజా సమస్యల పరిష్కారంలో మున్సిపల్ యంత్రాంగం ఘోరంగా విఫలమైందని ఆమ్ ఆద్మీ పార్టీ నేత సమీర్ అహ్మద్ మండిపడ్డారు. రోడ్లు పూర్తిగా దెబ్బతిని ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జోన్-4 పరిధిలో మున్సిపల్ పనులు చేయాల్సిన జేసీబీ గత కొంతకాలంగా మరమ్మతులకు గురైందని, దానిని బాగు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సమీర్ ఆరోపించారు. కేవలం సాకులు చెబుతూ కాలయాపన చేయడం వల్ల కాలనీలో కనీస పనులు కూడా జరగడం లేదని విమర్శించారు. రెండు నెలల క్రితమే రోడ్ల పరిస్థితిపై కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఏఈ సల్మాన్ మొయినుద్దీన్‌కు ఫోన్ చేస్తే "వస్తున్నా.. చేస్తున్నా" అని అబద్ధపు మాటలతో కాలం గడుపుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యను పరిష్కరించడం లేదని దుయ్యబట్టారు. అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల సామాన్య ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే జేసీబీని రిపేర్ చేయించి, కాలనీ రోడ్లపై మొరం లేదా డస్ట్ వేయించి రాకపోకలను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే కాలనీ ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# పోలీస్ వర్సెస్ ప్రెస్ క్లబ్ : స్నేహపూర్వక మ్యాచ్‌లో సీపీ లెవన్ విజేత

**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** నిజామాబాద్ నగరం సాక్షిగా శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్నేహపూర్వక పోరు హోరాహోరీగా సాగింది. ఖాకీలు, పాత్రికేయుల మధ్య జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో పోలీస్ కమిషనర్ లెవన్ జట్టు ఘనవిజయం సాధించింది. ప్రెస్ క్లబ్ జట్టుపై 43 పరుగుల తేడాతో విజయం సాధించి పోలీస్ టీం సత్తా చాటింది. తొలుత టాస్ గెలిచిన పోలీస్ టీం బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 12 ఓవర్లలో కేవలం 3 వికెట్లు కోల్పోయి 133 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఎస్సై కిరణ్ పాల్ బ్యాట్‌తో చెలరేగి 96 పరుగులతో అజేయంగా నిలిచి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఏసీపీ రాజా వెంకటరెడ్డి (25 పరుగులు) సమయోచితంగా రాణించారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ప్రెస్ క్లబ్ జట్టుకు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తన బౌలింగ్‌తో చుక్కలు చూపించారు. వేసిన ప్రతి ఓవర్‌లోనూ ఒక వికెట్ చొప్పున మూడు వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బతీశారు. అదనపు డీసీపీ బస్వా రెడ్డి సైతం ఒక వికెట్ తీసి సహకరించారు. ప్రెస్ క్లబ్ జట్టులో శివ ఠాగూర్ (24) ఒంటరి



పోరాటం చేసినా, నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 90 పరుగులకే జట్టు పరిమితమైంది. విజేతలకు సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ అంకిత్‌లు బహుమతులు అందజేశారు. ఉత్తమ బ్యాటర్‌గా కిరణ్ పాల్, ఉత్తమ బౌలర్‌గా శ్యామ్ సుందర్ అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ బస్వా రెడ్డి, ఏసీపీ రాజా వెంకటరెడ్డి, పలువురు సీఐలు, ఎస్సైలు, పాత్రికేయ మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయ జిన్నింగ్ లో సిసిఐ ను మోసగించిన నిందితుల అరెస్ట్

**ఆదిలాబాద్ జిల్లా జనవరి 09( డిడి9 వార్త న్యూస్)** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం లోని విజయ జిన్నింగ్ లో పనిచేస్తున్న ఏడుగురు మంది వ్యక్తులు ఎలాగైనా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని పథకం ప్రకారం సీసీఐని మోసగించాలని ఉద్దేశంతో ఒక లోడు గల ట్రాక్టర్ ని రెండుసార్లు తూకం చేసి ఒక రైతు సహాయంతో అతని అకౌంట్లోకి డబ్బులు కొట్టించుకుని ప్రభుత్వ సంస్థ అయినటువంటి సి సి ఐ ని మోసగించడం జరిగినది. వ్యక్తుల వివరాలు మూలే మారుతి, చెర్ల అరుణ్ కుమార్, ఐద శివరాజ్, గోతి సునీల్, నవీన్ నీలేష్ మరియు వారికి సహకరించిన గోకుల నారాయణ వీరందరూ పథకం ప్రకారం 15 ,16 డిసెంబర్ తేదీలలో తూకం వేసిన లోడ్



ట్రాక్టర్ ను మళ్లీ తూకం వేసి దాదాపు 82 .6 క్వింటాళ్ల పత్తిని మోసగించి సీసీఐకి అమ్మినట్టు తప్పుడు అమ్మకం జరిపి 6,61,626/- రూపాయలను వారు ఆర్జించి స్వార్ధానికి వాడుకున్నారనిఇట్టి వ్యక్తులలో నలుగురు నిందితులు మూలే మారుతి, చెర్ల అరుణ్ కుమార్ ,ఐద శివరాజ్, రాథోడ్ నవీన్ లను రిమాండ్ కి తరలించడం జరిగిందని ఇచ్చోడా సిఐ బి రాజు ప్రకటనలో తెలిపినారు.?

# ప్రజాస్వామ్యానికి ప్రతీక.. సాలుర విద్యార్థి పార్లమెంట్

**- పుస్తకాల సంచి బరువుపై గళమెత్తిన చిన్నారుల సభ**

**- బిల్లుకు ఆమోదం.. ప్రజాప్రతినిధుల ప్రశంసలు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** విద్యార్థులు రేపటి పౌరులు మాత్రమే కాదు, నేటి సామాజిక సమస్యలపై గళమెత్తే చైతన్యవంతులని సాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిరూపించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన విద్యార్థి పార్లమెంట్ ప్రజాస్వామ్య వ్యవస్థకు అద్దం పట్టింది. లోక్ సభను తలపించేలా సాగిన ఈ సభలో విద్యార్థులు స్పీకర్, ప్రధాని, మంత్రులు మరియు ప్రతిపక్ష నేతలుగా బాధ్యతలు చేపట్టి సభా నిర్వహణ తీరును కళ్ళకు కట్టినట్లు చూపారు.ప్రస్తుత విద్యా వ్యవస్థలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పుస్తకాల సంచి బరువు దీనిపై సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చ సాగింది. విద్యార్థుల ఆరోగ్యం, మానసిక వికాసం దృష్ట్యా బరువు తగ్గించాల్సిన అవశ్యకతను సభ్యులు నొక్కి చెప్పారు. అనంతరం ఈ అంశంపై ప్రవేశపెట్టిన బిల్లును మెజారిటీ ఓటింగ్ తో సభ ఆమోదించింది. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు దండు రాజ్ కుమార్, భగారే లక్ష్మ పర్యవేక్షణలో జరిగిన ఈ సభలో విద్యార్థుల సంభాషణలు, సమస్యల విశ్లేషణ ఉపాధ్యాయులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రధానోపాధ్యాయురాలు రాజీ మంజూష మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. విద్యార్థులకు ఉజ్వల రాజకీయ భవిష్యత్తు ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సొక్కం లావణ్య రవి, ఉప సర్పంచ్ బయ్యన్ సురేష్, వార్డు సభ్యులు సాయినాథ్ పాల్గొన్నారు. ఉపాధ్యాయ బృందం పురానే విజయ్ కుమార్, గంధం సాయిలు, సంగీతరావు, సంతోష్ యాదవ్, విఠల్ కాంబ్లే,




అరుణ్ కుమార్, సుధారాణి, విజయలక్ష్మ, శోభారాణి, వనజ, జ్యోత్స్న,అంజన పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.

# బోధన్ మున్సిపల్ బరిలో బీఎస్పీ : 38 వార్డుల్లోనూ పోటీకి సిద్ధం



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బోధన్ పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థులను బరిలోకి దించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు షైక్ మహ్మద్ ప్రకటించారు. శుక్రవారం బోధన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని 38 వార్డుల్లోనూ బీఎస్పీ బలంగా ఉందని, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కదలాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డులోనూ పార్టీ సిద్ధాంతాలను, ప్రజా సమస్యలను ఎజెండాగా చేసుకుని ప్రచారం నిర్వహించాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. అధికార పార్టీల వైఫల్యాలను ఎండగడుతూ, సామాన్య ప్రజల పక్షన పోరాడే అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యకర్తలు సమన్వయంతో క్షేత్రస్థాయికి వెళ్లి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరివేసు సంతోష్ మాట్లాడుతూ.. బహుజనుల రాజ్యాధికారం మున్సిపల్ వార్డుల నుంచే మొదలవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ రవి, నియోజకవర్గ అధ్యక్షులు రమేష్ దాస్ మరియు పట్టణ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం : సలహాదారు సుదర్శన్ రెడ్డి

**- బోధన్‌లో బస్తీ దవాఖానాను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**- బెల్లాల్‌లో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాల స్థల పరిశీలన**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని 32వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆయన ప్రారంభించారు. పాత చావిడి భవనాన్ని ఆధునీకరించి అందుబాటులోకి తెచ్చిన ఈ కేంద్రంలో వైద్య సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి భారీగా డబ్బులు ఖర్చు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదని హితవు పలికారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిష్ణాతులైన వైద్యులతో పాటు అన్ని రకాల మందులు, పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా బస్తీ దవాఖానాల ద్వారా స్థానికంగానే తక్షణ వైద్యం అందుతుందని ఆయన పేర్కొన్నారు.విద్యారంగానికి పెద్దపీట - స్థల పరిశీలన అనంతరం పట్టణ శివారులోని బెల్లాల్ ప్రాంతంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన 'సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థల' స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. విద్యా, వసతి సౌకర్యాలు ఒకే చోట ఉండేలా ఈ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ స్థలం విద్యార్థులకు ఎంతో అనువుగా ఉందని, యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్



హందాన్, వ్యవసాయ కమిషన్ చైర్మన్ గడుగు గంగాధర్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విట్టల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లయోలా పాఠశాలలో మిన్నంటిన సంక్రాంతి సంబరాలు

**- గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించిన విద్యార్థుల వేడుకలు**

**- తెలుగు లోగిళ్లను తలపించిన పాఠశాల ప్రాంగణం**



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని బోధన్ పట్టణంలోని లయోలా పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మన సంస్కృతీ సంప్రదాయాలను భావి తరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ వేడుకలు అలరించాయి. పాఠశాల ప్రాంగణమంతా రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, ఆటలతో సందడి నెలకొంది. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి పండుగ శోభను తీసుకువచ్చారు. విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆకట్టుకోగా, భోగి మంటలు, పతంగుల సందడితో పాఠశాల ఒక తెలుగు లోగిలిని తలపించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, జానపద గీతాలకు చేసిన నృత్యాలు అందరినీ ముగ్ధులను చేశాయి. పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ.. యాంత్రిక జీవనంలో పడి మన పండుగలను, ఆచారాలను మర్చిపోకూడదని, ఇలాంటి వేడుకల ద్వారా విద్యార్థులకు మన పూర్వీకుల గొప్పతనాన్ని వివరించవచ్చని తెలిపారు. గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా విద్యార్థులు ప్రదర్శించిన తీరును ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందూరుగా నిజామాబాద్ మార్పు ఖాయం: ఎంపీ అరవింద్

**- ప్రజల ఆకాంక్ష మేరకే పేరు మార్పు నిర్ణయం**

**- కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు**

**- కాంగ్రెస్ తీరుపై ధర్మపురి అరవింద్ మండిపాటు**

**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** నిజామాబాద్ జిల్లా పేరును ఇందూరుగా మారుస్తామని ఎంపీ ధర్మపురి అరవింద్ పునరుద్ఘాటించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ పేరు మార్చాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని, దీనిపై తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న



నిధులతోనే పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రచారానికే పరిమితమైందని విమర్శించారు. పదేళ్లలో నగరంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, ఈసారి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి 'జీ రామ్ జీ' అని పేరు మార్చడంపై కాంగ్రెస్ అనవసర రాజకీయం చేస్తోందని అరవింద్ మండిపడ్డారు. 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచి, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే డబ్బులు జమ చేస్తున్నామని వివరించారు. ఈ పథకాన్ని వ్యవసాయానికి కూడా అనుసంధానం చేయవచ్చని, నిరుద్యోగులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్?పాల్? సూర్యనారాయణ గుప్తా, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తదితరులు పాల్గొన్నారు.

# అధ్యయన యాత్రతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**- విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు**

**- రాష్ట్రపతి నిలయానికి వెళ్తున్న ప్రత్యేక బస్సు ప్రారంభం**

**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :**




విద్యార్థులు కేవలం పుస్తక పాఠాలకే పరిమితం కాకుండా, విజ్ఞాన యాత్రల ద్వారా ఆచరణాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న ఉద్యాన్ ఉత్సవ్ ను సందర్శించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన విద్యార్థినుల స్టడీ టూర్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. మోపాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన 52 మంది విద్యార్థినులను ఈ అధ్యయన యాత్ర కోసం ప్రభుత్వం తరపున ఎంపిక చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద విద్యార్థినుల బస్సుకు కలెక్టర్ పచ్చజెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులకు సూచనలు చేశారు. ఉద్యాన ఉత్సవంలో ప్రదర్శించే వివిధ రకాల పుష్పాలు, అరుదైన మొక్కల గురించి అవగాహన ఏర్పర్చుకోవాలని బాలికలకు సూచించారు. యాత్రకు వెళుతున్న విద్యార్థినులకు భోజనం, రవాణా తదితర అన్ని వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విజ్ఞానంతో తిరిగి రావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, ఉద్యానవన శాఖ ఏపీడీ భారతి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: ఎంపీ ధర్మపురి అరవింద్

**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :**



జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ఇలా త్రిపాఠిని పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా సమగ్ర కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలిసిన ఆయన, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఎంపీ ప్రత్యేకంగా ఆరా తీశారు. నియోజకవర్గ పరిధిలో ప్రజలకు ఉపయోగపడే వివిధ అభివృద్ధి పనులు పెండింగ్లో ఉన్నాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను సూచించారు. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికార యంత్రాంగం సమర్థవంతంగా కృషి చేయాలని ఎంపీ అన్నారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కోరారు. ముఖ్యంగా అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా వేగం పెంచాలని ఈ సందర్భంగా కలెక్టర్ ను కోరారు.

# చిన్నారులు, మహిళల సంక్షమమే ప్రభుత్వ ధ్యేయం

**- ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :**

అంగన్?వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన పౌష్టికాహారం మరియు ఆరోగ్య సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని లయన్స్ భవన్?లో నిర్వహించిన కార్యక్రమంలో బోధన్ పట్టణం, బోధన్ రూరల్ లో ఉన్న అంగన్?వాడీ కేంద్రాలకు అవసరమైన సామగ్రిని వారు పంపిణీ చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చొరవతో దీక్షత్ గ్యాస్ ఏజెన్సీ వారు 113 అంగన్?వాడీ కేంద్రాలకు ఉచితంగా గ్యాస్ పొయ్యిలను సమకూర్చారు. కేంద్రాల్లో సరుకులను భద్రపరుచుకోవడానికి స్థానిక నాయకుడు శరత్ రెడ్డి అందించిన ప్లాస్టిక్ కంటైనర్లను కూడా అందజేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. మిగిలిన కేంద్రాలకు కూడా త్వరలోనే సామగ్రిని సమకూరుస్తామని హామీ ఇచ్చారు. మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు.హక్కులు – బాధ్యతలు గుర్తెరగాలి : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిజిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. మహిళల సంక్షమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగానే మినీ అంగన్?వాడీలను అప్‌గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. అంగన్?వాడీ ఉద్యోగులు తమ బాధ్యతలను గుర్తించి, క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పౌష్టికాహార పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహశీల్దార్ విఠల్, సీడీపీవో పద్మ మరియు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# వ్యభిచార గృహాలపై సీసీఎస్ మెరుపు దాడులు

**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం సీసీఎస్ పోలీసులు నగరంలోని పలు ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వ్యభిచార గృహాలను నిర్వహిస్తున్న స్థావరాలపై పోలీసులు మెరుపు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీసీఎస్ ఏసీపీ (ఇంచార్జ్) మస్తాన్ వాలి పర్యవేక్షణలో పోలీసులు బృందాలుగా విడిపోయి నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్, ఆరో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనుమానిత గృహాలపై దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు ఆధారాలు లభించడంతో 4 గురు విటులు, 5 గురు విటురాళ్లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 8 మొబైల్ ఫోన్లు, రూ. 27,290 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను, సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలకు అప్పగించారు. నగరంలో





శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా ఇలాంటి పనులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా పోలీస్ అధికారులు హెచ్చరించారు.

# ఈ నెల 11న మాల సర్పంచులు, ఉప సర్పంచులకు సన్మానం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :**

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులుగా, ఉప సర్పంచులుగా ఎన్నికైన మాల సామాజికవర్గ ప్రతినిధులను ప్రోత్సహించేందుకు ఈ నెల 11న భారీ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య తెలిపారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో పట్టణ అధ్యక్షుడు రేఖాందాస్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. మాల కులస్తులు రాజకీయాల్లో తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ప్రజా సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. ఎన్నికైన ప్రతినిధులను గౌరవించుకోవడం మన బాధ్యతని, అందుకే ఈ నెల 11న ఉదయం 11 గంటలకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఈ ఆత్మీయ సన్మాన వేడుకను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, భూపతి రెడ్డి, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ రిక్క లింబాద్రి, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, ఎట్ల నాగరాజు




తదితర ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. బోధన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల నుంచి నూతనంగా ఎన్నికైన మాల సామాజికవర్గ సర్పంచులు, ఉప సర్పంచులు ఈ కార్యక్రమానికి సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు మిర్జాపురం సాయన్న, మాజీ సర్పంచ్ బంటు సాయిలు, ఉపాధ్యక్షుడు కారం స్వామి, పట్టణ నాయకులు సంజీవ్ కుమార్, బాలరాజు, రవీంద్రబాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల హక్కులపై ప్రభుత్వాల దాడిని సహించబోం

**- నిజామాబాద్‌లో కేంద్ర, రాష్ట్ర పెన్షనర్ల భారీ ధర్నా**

**- 'పెన్షన్ వ్యాలిడిటీ యాక్టును రద్దు చేయాలి: రామ్మోహనరావు డిమాండ్**

**- బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేత**

**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల పట్ల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహించారు. జాతీయ పెన్షనర్ల సంఘం పిలుపు మేరకు గాంధీ చౌక్ వద్ద ఉన్న బీఎస్ఎన్ఎల్ సంచార్ భవన్ ఎదుట జరిగిన ఈ నిరసనలో వివిధ శాఖల పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా గౌరవ అధ్యక్షులు కే.రామ్మోహనరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన పెన్షన్ వ్యాలిడిటీ యాక్ట్ పెన్షనర్ల హక్కులను కాలరాసేలా ఉందన్నారు. పాత, కొత్త పెన్షనర్లుగా విభజించి వారి మధ్య చిచ్చు పెడుతూ ప్రభుత్వం దాడి చేస్తోందని మండిపడ్డారు. ధర్నాలో నాయకులు ప్రతాపరెడ్డి, షేక్ హుస్సేన్, ఈవీఎల్ నారాయణ, మధుసూదన్ మాట్లాడుతూ వివాదాస్పదమైన పెన్షన్ వాలిడేషన్ యాక్టును తక్షణమే







ఉపసంహరించుకోవాలి. 8వ సెంట్రల్ పే కమిషన్ సిఫార్సులకు అవసరమైన సవరణలు చేయాలి. బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు వెంటనే పెన్షన్ అప్ డేషన్ చేయాలి. ఎన్‌పీఎస్, యూపీఎస్ లను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. మార్కెటింగ్ శాఖ రిటైర్డ్ ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా పెన్షన్ చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన మెమొరాండంను భారత ప్రధానమంత్రికి పంపాలని కోరుతూ జిల్లా బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈవీఎల్ నారాయణ, నాయకులు సిర్ప హనుమండ్లు, రామారావు, శంకర్, ప్రసాదరావు, బాలదుర్గయ్య, పబ్బ మురళి తదితరులు పాల్గొన్నారు. దాదాపు 150 మందికి పైగా రిటైర్డ్ ఉద్యోగులు హాజరై నిరసన వ్యక్తం చేశారు.

# ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చడం దుర్మార్గం : డీసీసీ అధ్యక్షులు కట్పల్లి నగేష్ రెడ్డి

**- 20 నుండి 30 వరకు గ్రామసభల్లో నిరసన తీర్మానాలు**

**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :**

గ్రామీణ పేదల పాలిట వరప్రదాయినిగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీరుగారుస్తోందని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్పల్లి నగేష్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. 2004లో సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వలసలను నివారించేందుకు ఉపాధి హామీ పథకాన్ని తెచ్చిందని ఆయన గుర్తు చేశారు. పని దినాలను 125 రోజులకు పెంచుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ, కేవలం 75 రోజుల నిధులు మాత్రమే ఇస్తూ.. మిగతా 50 రోజుల భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమని విమర్శించారు. మహాత్మా గాంధీ గారి పేరును తొలగించి 'జీ రామ్ జీ' అని పేరు మార్చడం వెనుక ఈ పథకాన్ని పూర్తిగా రద్దు చేసే కుట్ర దాగి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఇప్పటికే కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేసిందని నగేష్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఈ నెల 20 నుండి 30 వరకు అన్ని గ్రామాల్లో 'గ్రామసభలు' నిర్వహించి, కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. 125 రోజుల పని భారాన్ని కేంద్రమే భరించాలని ప్రతి గ్రామ సర్పంచ్ తీర్మానం చేయాలని కోరారు.ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనం బయటకు తీసి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి నరేంద్ర మోడీ ప్రజలను నిలువునా వంచించారని ధ్వజమెత్తారు. 2029లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని, అప్పుడు ఉపాధి



హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే పునరుద్ధరిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పేదల పొట్ట కొట్టి కార్పొరేట్ సంస్థలకు మేలు చేయడమే బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, వర్ని ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా, వివిధ విభాగాల అధ్యక్షులు యాదగిరి, రాజా నరేందర్ గౌడ్, సంతోష్, ఎజాస్, ఈసా, సాయిరెడ్డి, నరేందర్ గౌడ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు తెలంగాణలో ఆలయానికి రూ.35.19 కోట్లు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

**జగిత్యాల జిల్లా :** తెలంగాణలోని ఆలయానికి టీటీడీ నిధులు ఇవ్వగా.. ఏపీ ప్రభుత్వం పాలనా అనుమతులు మంజూరు చేసింది. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి రూ.35.19 కోట్లతో మాల విరమణ మండపం, వసతి నిర్మాణం కోసం టీటీడీ పాలకమండలిలో నిర్ణయం తీసుకోగా.. ఏపీ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్మాణాల కోసం టీటీడీ నిబంధనల ప్రకారం టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. కొండగట్టు ఆలయానికి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. అయితే ఈ ఆలయంలో సరైన వసతులు లేవని, అందుకే ఈ నిర్మాణాలు చేపట్టాలని ఆలయ ఈవో గతంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరారు. వెంటనే స్పందించిన ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, టీటీడీ దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.సాధారణంగా టీటీడీ నిబంధనల ప్రకారం.. వార్షిక ఆదాయం రూ.కోటి కంటే తక్కువ ఉన్న ఆలయాలకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం కుదరదు. అయితే కొండగట్టు ఆలయ ప్రాధాన్యత, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, టీటీడీ పరిధిలో లేకపోయినా దీనిని ఒక ప్రత్యేక కేసుగా పరిగణించారు. టీటీడీ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. సుమారు 2,000 మంది భక్తులు



కూర్చొంగలిగేలా మాల విరమణ మండపం, 96 గదులతో వసతి (సత్రం) నిర్మాణం కోసం ఈ అంచనా వ్యయాన్ని రూపొందించారు. ఈ నిర్మాణాల వల్ల భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గతవారం కొండగట్టుఆలయానికి వెళ్లారు.కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే రూ.35.19 కోట్ల టీటీడీ నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి ఆయన స్వయంగా భూమిపూజ చేశారు. కొండగట్టు ఆలయంలో అభివృద్ధి పనులను ప్రారంభించడం దేవుడి దయతోనే సాధ్యమైందన్నారు. తనకు కొండగట్టు పునర్జన్మనిచ్చింది.. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి తాను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుందన్నారు. కొండగట్టు ఆంజన్న తనను కాపాడారని, అందుకే స్వామి పట్ల అపార భక్తితో, కృతజ్ఞతతో తన వంతు సేవ చేస్తున్నానన్నారు.గతంలో కొండగట్టు ఆలయానికి వచ్చినప్పుడు, భక్తుల సౌకర్యార్థం వసతి సముదాయం నిర్మించాలని కోరారన్నారు పవన్ కళ్యాణ్. ఈ విన్నపాన్ని ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీటీడీ పాలకమండలి ముందుంచారు.. వారు దీనిని ఆమోదించడంతో ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ విషయంలో సహకరించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుల సహకారంతో ఆంజన్న దేవుడి రుణాన్ని తీర్చుకున్నానన్నారు. కొండగట్టు ఆంజన్న విశ్వాంతర్యామి అని, ఆయనకు సేవ చేసుకునే అవకాశాన్ని గొప్ప అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అలాగే తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరిన విధంగా, ఇక్కడ గిరి ప్రదక్షిణ వసతి తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. తాను కూడా వచ్చి, ఆ పనుల్లో స్వచ్ఛందంగా పాల్గొంటానని చెప్పారు. కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కూడా ధన్యవాదాలు తెలిపారు పవన్ కళ్యాణ్.

# తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, జనవరి 9:** తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. డీజీపీ నియామక ఉత్తర్వులను సస్పెండ్ చేయాలన్న పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా శివధర్‌రెడ్డిని డీజీపీగా నియమించారంటూ హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త టి.ధన్‌గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం డీజీపీ నియామక ఉత్తర్వులపై స్టే విధించడానికి నిరాకరించింది. రెగ్యులర్ ప్రాసెస్‌ను 4 వారాల్లో పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పూర్తిస్థాయి డీజీపీ నియామకం కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. యూపీఎస్‌సీకి పంపిన తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సూచిస్తూ.. తదుపరి విచారణను హైకోర్టు ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది.



# గడువు ముగిసినా నివాసయోగ్యపత్రం - కానీ షరతులు వర్తిస్తాయి

**హైదరాబాద్, జనవరి 9:** నిర్ణీత గడువులోపు నివాసయోగ్యపత్రం(ఓసీ) పొందలేకపోయిన భవనాలకు ఉపశమనం కల్పించడానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలను పాటించి ఇంటి నిర్మాణం చేపడితే ఆలస్యమైనా సరే ఓసీ జారీ చేయనున్నట్లు ఆయన వివరించారు. అందులో భాగంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల దరఖాస్తులను రెండు రకాలుగా విభజించి వాటికి సంబంధించి పలు మార్గదర్శకాలను గురువారం జారీ చేశారు.



రెండు కేటగిరీల్లోనూ భవన నిర్మాణంలో ఉల్లంఘనలు గరిష్ఠంగా 10 శాతం మాత్రమే ఉండాలని, 18 మీటర్ల ఎత్తు వరకు అనుమతి తీసుకున్న భవనాలకు మాత్రమే ఈ నిర్ణయం వర్తించనుందని కర్ణన్ స్పష్టం చేశారు.మార్గదర్శకాలు ఇలా : భవన నిర్మాణ అనుమతి గడువు ముగిసిన తేదీ నుంచి రెండేళ్ల లోపు ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే పెండింగులోని నిర్మాణ అనుమతి రుసుము, లింకు రోడ్డు ఛార్జీలు, సీఆర్ఎంపీ ఫీజు, ఇతరత్రా అన్ని రకాల రుసుములతో వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. నిర్మాణ అనుమతి గడువు ముగిసిన తేదీ నుంచి రెండేళ్ల తర్వాత దరఖాస్తు చేసుకున్నట్లయితే దరఖాస్తు తేదీ నాటికి మొత్తం నిర్మిత విస్తీర్ణానికి వర్తించే అన్ని రకాల రుసుములు, ఛార్జీలు వసూలు చేస్తారు.నివాసయోగ్య పత్రం అంటే? ఇది భవనం సురక్షితమైనేదేనని, మున్సిపల్ కార్పోరేషన్? నిబంధనలను పాటించి నిర్మించిందని తెలిజేసే పత్రం. దీనిని తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు పొందడానికి, మనకున్న ప్రాపర్టీని విక్రయించడానికి, రిజిస్ట్రేషన్ చేయడానికి ఇది తప్పనిసరిగా పరిగణలోనికి తీసుకుంటారు.

# రైతన్నలకు గుడ్ న్యూస్ కొత్త పథకాలు ప్రారంభం

**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 9 :** గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన జీవిత లక్ష్యమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు.(శుక్రవారం) అశ్వరావుపేట వ్యవసాయ కళాశాలలో రైతు మేళా కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం, ప్రకృతి వ్యవసాయ పథకాలను మంత్రులు ప్రారంభించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. దివంగత ఎన్టీఆర్ దీవెనలతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టులో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ డీపీఆర్‌లో లేదని ప్రస్తావించారు. తమ ప్రభుత్వంలో కెనాల్స్‌కు నిధులు మంజూరు చేశామని తెలిపారు.గోదావరి నీళ్లు వస్తాయి.బీఆర్ఎస్ పాలనలో మూలకిపడిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం పున:ప్రారంభోత్సవం చేశామని తెలిపారు. 350 మంది రైతులకు రూ.1.07 కోట్లు విలువైన యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ చేశామని వెల్లడించారు. జాతీయ ప్రకృతి



వ్యవసాయ మిషన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయ పథకం ప్రారంభించినట్లు వివరించారు. వ్యవసాయ ఉద్యాన పామాయిల్ సాగుపై శాస్త్రవేత్తలు ఆదర్శ రైతులతో అవగాహన సదస్సు నిర్వహించామని పేర్కొన్నారు. నాలుగో పంపు హౌస్ నిర్మాణంతో దమ్మపేట, అశ్వరావుపేట మండలాలకు గోదావరి నీళ్లు వస్తాయని వెల్లడించారు. ఆయిల్ ఫామ్‌లో అంతర పంటలుగా కోకో, జాజి, వక్క, మిరియం, సాగుతో రైతులకు అదనపు లాభాలు వస్తాయని తెలిపారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.దేశానికే ఆదర్శంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.దేశానికే ఆదర్శంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ రంగంలో అగ్ర భాగాన ఉండాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణకు తమ ప్రభుత్వం పట్టుదలగా ఉందని పేర్కొన్నారు. సన్నకారు రైతులకు మేలు చేయాలని వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని చెప్పుకొచ్చారు. సంక్రాంతి పండుగ రోజు నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి 470 బిలియన్ డాలర్స్ వ్యవసాయ రంగం వాటా ఉండేలా తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఉందని వెల్లడించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఉత్తమ కళాశాలగా నిలవాలని సూచించారు. పామాయిల్ సాగుతో రైతులకు మహర్దశ వచ్చిందని తెలిపారు. భద్రాద్రి శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆశీస్సులతో సీతారామ ప్రాజెక్టు పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# కేటీఆర్‌పై గజ్జెల కాంతం షాకింగ్ కామెంట్స్


**హైదరాబాద్, జనవరి 9:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పీసీసీ తెలంగాణ జనరల్ సెక్రెటరీ గజ్జెల కాంతం సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. దుబాయ్‌లో తన బినామీని చంపితే ఆధారాలు పోతాయని కేటీఆర్ భ్రమపడ్డారని గజ్జెల కాంతం ఆరోపించారు. నాలుగు రాష్ట్రాల్లో కేటీఆర్ మకాం వేసేవారని తెలిపారు. 2022 జనవరి 24న ఒక హీరోయిన్‌కు కేటీఆర్ రూ.100 కోట్లు ఇచ్చారని.. ఒక కాంట్రాక్టర్, జ్యువెలరీ షాప్ యజమాని అకౌంట్ నుంచి ఆ మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేయించారని సంచలన వ్యాఖ్యలు చేశారు.హీరోయిన్‌ను బెదిరించి మరీ.ముంబైలోని తాజ్ కృష్ణా హోటల్ 328వ గదికి ఒక హీరోయిన్‌ను పిలిపించి, రూ.35 కోట్ల 75 లక్షలతో విల్లా కొనిచ్చారని, ఆడి కారు కూడా బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు. 2022 మార్చి 3న ఢిల్లీలోని లలిత్ హోటల్ 770వ గదికి.. మైసూర్‌అబత్రీశ్రీలో షూటింగ్ చేస్తున్న హీరోయిన్‌ను బెదిరించి పిలిపించుకున్నారని, రూ.50 కోట్లు ఇస్తానని బెదిరింపులకు పాల్పడ్డారని తీవ్ర



ఆరోపణలు చేశారు. కేసీఆర్ కుటుంబం అమెరికాలో రూ.40 వేల కోట్లు, దుబాయ్‌లో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిందన్నారు. దాదాపు 30 వేల ఎకరాల భూములు దోచుకున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఇవన్నీ అబద్ధాలని తన కొడుకుపై ప్రమాణం చేయగలరా అని గజ్జెల కాంతం నిలదీశారు.రాహుల్ కాలి గోటికి సరిపోరు.కేసీఆర్‌కు ఎన్టీఆర్, చంద్రబాబు రాజకీయ భిక్ష పెట్టారని.. దొంగ పాస్‌పోర్టులు సృష్టించిన చరిత్ర కేసీఆర్ దేనని గజ్జెల కాంతం విరుచుకుపడ్డారు. ఎన్నికల కోసం జగన్‌కు రూ. 200 కోట్లు.. మహారాష్ట్ర, బీహార్, పంజాబ్, ఢిల్లీకి కోట్లాది రూపాయలను కేసీఆర్ పంపారన్నారు. అఖిలేష్ యాదవ్, కుమారస్వామికి కేటీఆర్ డబ్బులు పంపారని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా, రాహుల్‌పై కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ కుటుంబం వల్లే కేటీఆర్ మంత్రి అయ్యారని, రాహుల్ కాలి గోటికి కూడా కేటీఆర్ సరిపోరని వ్యాఖ్యానించారు.రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిందని, కేటీఆర్ కుటుంబం ఏం త్యాగం చేసిందని గజ్జెల కాంతం ప్రశ్నించారు. చట్టాలు, రాజ్యాంగంపై కేటీఆర్‌కు గౌరవం, జ్ఞానం లేదని, చరిత్ర తెలియదని విమర్శించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదని.. కేటీఆర్ లాగా రాహుల్, రేవంత్‌లు దోచుకోలేదని గజ్జెల కాంతం పేర్కొన్నారు.

# చైనా మాంజా ప్రమాదం నాలుగేళ్ల చిన్నారికి తీవ్రగాయాలు

**జగిత్యాల జిల్లా, జనవరి9 :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో గుండెలను పిండేసే ఘటన చోటుచేసుకుంది. నిషేధిత చైనా మాంజా మరొకరిని తీవ్రంగా గాయపరిచింది. గాలిపటంతో ఆడుకుంటున్న ఓ చిన్నారి మెడకు.. మాంజా చుట్టుకోవడంతో గొంతు తెగి తీవ్ర రక్తస్రావమైంది. ప్రస్తుతం ఆ బాలుడు మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపడమే కాకుండా.. నిషేధిత మాంజా విక్రయాలపై ప్రజల్లో తీవ్ర ఆందోళనను కలిగిస్తోంది.దుబ్బవాడలో విషాదంమెట్‌పల్లి పట్టణంలోని దుబ్బవాడ ప్రాంతానికి చెందిన శ్రీహాస్ (4) అనే బాలుడు తన ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో చైనా మాంజా ఒక్కసారిగా గొంతుకు చుట్టుకుంది. మాంజాను తీయబోతుండగా గొంతు తెగి తీవ్ర రక్తస్రావమైంది. గొంతు భాగంలో తీవ్రమైన గాయమవడంతో చిన్నారి గట్టిగా కేకలు వేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు రక్తపు మడుగులో ఉన్న బాలుడిని చూసి షాక్‌కు గురయ్యారు. వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆపై మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.విషమంగా ఆరోగ్యం.నిజామాబాద్ ఆస్పత్రిలో బాలుడికి అత్యవసర శస్త్రచికిత్స



# సింగోటం జాతర ,బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి

**కొల్లాపూర్ :** నాగర్ కర్నూలు జిల్లా సింగోటంలక్ష్మనర్సింహస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. ఈనెల 15 నుంచి 21 వరకు కొల్లాపూర్, శ్రీలక్ష్మనరసిం హస్వామి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆలయాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ , అధికారులతో కలిసి సందర్శించిన సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక




రాష్ట్రాల నుంచి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు . ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీస్ శాఖాధికారులను ఆదేశించారు. జాతరలో తాగునీటి, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం వంటి ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.రాయలసీమ భక్తుల కోసం నందికొట్కూర్ కర్నూలు నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైతే సోమశిల, మంచాలకట్ట వద్ద టూరిజం శాఖకు చెందిన చిన్న బోట్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.రథోత్సవం రోజున ప్రతి గ్రామం నుంచి బస్సు నడపాలని, కొల్లాపూర్ డిపో నుంచేగాక ఇతర ప్రాంతాల నుంచి అదనపు బస్సులు తెప్పించాలని సూచించారు.

# ప్రజలకు మీసేవ సేవలు మరింత చేరువ కావాలి


- జిల్లా మీసేవ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ




**నిజామాబాద్ జిల్లా జనవరి 09(డీడీ9 వార్త) :** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ మీసేవ కేంద్రాల నిర్వాహకులు చురుకైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శుక్రవారం నిజామాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా మీసేవ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డితో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు వివిధ ప్రభుత్వ ధృవీకరణ పత్రాలు, సేవల కోసం మీసేవ కేంద్రాలపై ఆధారపడతారని, నిర్వాహకులు ఎక్కడా జాప్యం లేకుండా పారదర్శకంగా సేవలు అందించాలని కోరారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మీసేవ డిస్ట్రిక్ మేనేజర్ కార్తీక్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు సితారి ప్రవీణ్ రాజ్, కార్యదర్శి షాహిద్ అలీ పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యక్షులు దొమ్మాటి రవీందర్, జాయింట్ సెక్రెటరీ శివ ప్రసాద్, కోశాధికారి ప్రభు, కల్చరల్ సెక్రెటరీ రవి కుమార్ తదితర అసోసియేషన్ ప్రతినిధులు ఈ వేడుకలో భాగస్వాములయ్యారు.

# క్యూలైన్లలో ఫ్యాన్లు నిమిషాల్లోనే దర్శనం

**మేడారం:** మేడారం ఖ్యాతి ఖండాంతరాలు దాటుతోంది. సమ్మక్క, సారల మ్మను దర్శించుకునేందుకు ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తోంది. అయితే మన రాష్ట్రం నుంచే కాకుం డా దేశ విదేశాల నుంచి భక్తులు రావడంతో దానికి అనుగుణ ంగానే ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావించింది. దీనికోసం భక్తుల కోసం సౌకర్యాలు కల్పించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించింది.వన దేవత సమ్మక్క, సారలమ్మ మహా జాతరలో భక్తుల కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తోంది. దేవతల దర్శనం పూర్తయిన భక్తులకు ఇబ్బం దులు కలగకుండా ఉండేందుకు ఈసారి క్యూలైన్‌ల నిర్మాణం వినూత్నంగా చేపడుతున్నారు. పది నుంచి ఇరవై నిమిషాల వ్యవధిలోనే దర్శనం జరిగేలా రూ.3 కోట్లతో జరుగుతున్న క్యూలైన్ల నిర్మాణంపై ప్రత్యేక కథనం.తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో : ఇంత వరకు జాతర గద్దెల ప్రాంగణానికి కుడి, ఎడమ, వెనక వైపు క్యూలైన్లు ఉండేవి. కాగా ఈసారి కుడి వైపున్న వరుసలను తొలగించి స్మృతివనం నిర్మిస్తున్నారు. ఎడమ వైపు ఉన్న వాటన్నింటిని తొలగించారు. మొత్తం ఐదు వరుసలను నిర్మిస్తున్నారు. ఈ వరుసల్లో ప్రవేశించిన భక్తులు సమారు 750 మీటర్లు నడిచి, గద్దె ప్రాంగణానికి చేరుకుంటారు. మధ్య వరుసను పోలీసులు, వాలంటీర్ల కోసం వినియోగిస్తారు. దానికి కుడి వైపు ఉన్న రెండు, ఎడమ వైపు ఉన్న రెండు వరుసల్లో మాత్రమే భక్తులను అనుమతిస్తారు.వీటిపై నీడ కోసం తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో షెడ్లు



నిర్మిస్తున్నారు. లైన్లలో వేచి ఉండే భక్తులు ఒత్తిడికి గురి ఖకుండా ఉండేందుకు ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. గతంలో భక్తులు ఒక వరుస నుంచి మరో వరుసలోకి వెళ్లేందుకు ఇనుప బొంగుల మధ్య కొంతం స్థలం ఉండేది. ఈసారి అలాంటి అవకాశం లేకుండా ఏర్పాట్లు చేశారు.వీఐపీల కోసం ప్రత్యేకంగా : దేశం లోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల గవర్నలు, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులతో పాటు రాష్ట్రానికి చెందిన వేలాది మంది ప్రముఖులు దేవతలను దర్శించుకొనేందుకు మహా జాతరకు వస్తుంటారు. వీరందరికీ వీఐపీ దర్శినం అందేలా చేయడం అధికారులకు సవాల్?గా మారుతోంది. గతంలో వీఐపీల కోసం ప్రత్యేకంగా ఒక వరుస ఉండగా, పైరవీల కారణంగా తొలగించారు. ఈసారి మాత్రం మాస్టర్ ప్లాన్‌లో ప్రత్యేకంగా వీఐపీ వరుసను పక్కాగా ఏర్పాటు చేస్తున్నారు.సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 18న సాయంత్రం మేడారం వెళ్లనున్నారు. తర్వాత రోజు ఉదయం పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క ఇదివరకే వివరించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి పనుల సమీక్షకు హాజరైన మంత్రులు పలు వివరాలను వెల్లడించారు. రూ.251 కోట్లతో జాతర ఏర్పాట్లు, సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణం జరుగుతోందని, పనులు తుది దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.మాజీ సీఎంకు ఆహ్వానం : మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతరకు రావాల్సిందిగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్?ను రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు సీతక్క, కొండా సురేఖలు గురువారం ఆహ్వానించారు. ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మంత్రులను కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. మంత్రులు జాతర ఆహ్వాన పత్రికను ఆయన?కు అందజేశారు. తమ ఇంటికి విచ్చేసిన మహిళా మంత్రులకు కేసీఆర్? ఆత్మీయంగా స్వాగతం పలికారు. కేసీఆర్? - శోభ దంపతులు పసుపు, కుంకుమ, తలంబ్రాలు, వస్త్రాలతో సంప్రదాయ రీతిలో మంత్రులను సత్కరించారు. వారు అందించిన విందును స్వీకరించిన మంత్రులు, పరస్పర యోగాక్షమాలు తెలుసుకుని హైదరాబాద్?కు బయలుదేరారు.